సాక్షి
కామారెడ్డి
ఆదివారం : 30 : జూలై : 2023



సమస్యలను పరిష్కరించాలి

ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.

- 8లో ▸



ప్రమాదకరంగా వంతెనలు

కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై వంతెనలు ప్రమాదకరంగా మారాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.8 /22.9

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతమవుతుంది. సాయంత్రం చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఉద్యోగావకాశాలు కల్పించండి



కామారెడ్డి టౌన్ : వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్(పురుష) అభ్యర్థుల పోస్టులను భర్తీ చేయాలని ఎంపీహెచ్ఏ అసోసియేషన్ ప్రతినిధులు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావుకు విన్నవించారు. శనివారం జిల్లాకు చెందిన అభ్యర్థులు సిద్దిపేట్‌కు తరలివెళ్లి మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంపీహెచ్ఏ(పురుష) కోర్సును పూర్తి చేసుకుని చాలా ఏళ్లుగా ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్నామన్నారు. త్వరలో అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు జిల్లా ఎంపీహెచ్ఏ అభ్యర్థులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎంపీహెచ్ఏ అసోసియేషన్ నాయకులు శ్రావణ్, లింగం తదితరులున్నారు.

ఎస్పీగా వెళ్లిన ఏఎస్పీ అన్యోన్య



కామారెడ్డి క్రైం : కామారెడ్డి ఏఎస్పీగా నాలుగున్నరేళ్ల పాటు సేవలందించిన అన్యోన్య ఎస్పీగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. రాష్ట్ర పోలీసుశాఖలోని సీఐడీ విభాగంలో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అందుకుగాను శనివారం ఆయన ఇక్కడ నుంచి రిలీవ్ అయ్యారు. రిలీవ్ అవుతున్న సందర్భంగా ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాలోని పోలీసుశాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



మాచారెడ్డి : ఇటీవల దంచికొట్టిన భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, పంటలను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎంపీపీ లోయపల్లి నర్సింగరావ్ శనివారం పరిశీలించారు. మండలంలోని రత్నగిరిపల్లి, ఎల్లంపేట, అంకిరెడ్డిపల్లితండాల్లో ధ్వంసమైన రోడ్లను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట జెడ్పీటీసీ సభ్యుడు మిన్కూరి రాంరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పూల్‌చంద్‌నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాల్‌చంద్రం, నాయకులు రామ్మోహన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులున్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని వెంకంపల్లి వద్ద మంజీర నీటితో ముంపునకు గురైన పంటలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.15వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మంజీర పరివాహక ప్రాంతంలో పంటలు మునిగిన రైతులకు గతంలో ఫసల్ బీమా యోజన పథకం ద్వారా నష్టపరిహారం లభించిందన్నారు. తాను కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని అన్నారు. తాను బీజేపీలోనే కొనసాగుతానని, పార్టీ మారే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు హన్మాండ్లు, నాయకులు నర్సింహారెడ్డి, శివకుమార్, కృష్ణ, విఠల్‌గౌడ్, బాషమియా తదితరులు ఉన్నారు.

ఎస్సారెస్పీని సందర్శించిన మిషన్ భగీరథ సీఈ

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను శనివారం మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ రాంచంద్ సందర్శించారు. ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలతో గ్రామాల్లో దెబ్బతిన్న మిషన్ భగీరథ పైపు లైన్‌లను పరిశీలించి, ప్రాజెక్ట్‌ను సందర్శించానన్నారు. ఈఈ నరేశ్‌బాబు, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ రమేశ్ ఉన్నారు.

ఓ కానుక ఇద్దాం!

- మనసులో నాటుకుపోయేలా..
- బర్త్‌డే ఫంక్షన్లలో రిటర్న్ గిఫ్ట్‌గా మొక్కలు
- పుట్టిన, పెళ్లి రోజుల్లో పెరుగుతున్న మొక్కలు నాటే సంస్కృతి
- అధికారులు, ప్రజాప్రతినిధులకూ మొక్కలతో స్వాగతం



కూతురి పుట్టిన రోజు సందర్భంగా మొక్కలను రిటర్న్ గిఫ్ట్‌గా అందిస్తున్న సృజన్, వెన్నెల



అప్పటి కలెక్టర్ సత్యనారాయణకు మొక్కను ఇస్తున్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్

పిల్లల పుట్టిన రోజు వేడుకలు, వివాహ వార్షికోత్సవ వేడుకలను తమ స్థాయికి తగ్గట్టుగా గొప్పగా జరుపుకునేందుకు చాలామంది ఆసక్తి చూపుతుంటారు. కొందరు తమ స్థాయికి మించి ఆర్భాటంగా జరుపుకుంటారు. మరికొందరు మాత్రం భిన్నంగా ఆలోచిస్తున్నారు. తమ పుట్టిన, పెళ్లిరోజుల్లో మొక్కలు నాటి.. మొక్కలు కానుకగా ఇచ్చి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. – సాక్షి, కామారెడ్డి

సండే స్పెషల్

చాలామంది తమ స్థాయికి తగ్గట్టుగా నలుగురిలో గొప్పగా ఉండేలా తమ పుట్టిన, పెళ్లి రోజులను జరుపుకునేందుకు ఆసక్తి చూపుతుంటారు. వేడుకల పేరుతో రూ.లక్షలు నీళ్లలా ఖర్చు పెడుతున్నారు. అయితే 'కొందరు' భిన్నంగా ఆలోచిస్తూ సమాజానికి ఉపయోగపడేలా ఏదైనా చేయాలనే ఉద్దేశంతో మొక్కలు నాటడం.. మొక్కలు కానుకగా ఇవ్వడంపై ఆసక్తి చూపుతున్నారు. తాము ఇచ్చిన మొక్క, తాము నాటిన మొక్క పెరిగి పెద్దదైతే సమాజానికి తాము మేలు చేసిన వాళ్లమవుతామనే అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధి పేరుతో చెట్లను నరికేస్తుండడంతో అడవులు అంతరించి వాతావరణ సమతుల్యత దెబ్బతిని అనర్థాలకు దారితీస్తున్న పరిస్థితుల్లో మొక్కల గురించి ఆలోచిస్తున్న వారు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

పిల్లల పుట్టిన రోజు వేడుకల సందర్భంగా రిటర్న్ గిఫ్ట్‌లుగా మొక్కలు ఇచ్చే సంప్రదాయం పెరుగుతోంది. ఇటీవలి కాలంలో చాలామంది పిల్లల పుట్టినరోజు వేడుకల్లో మొక్కలు ఇస్తున్నారు. అలాగే పెళ్లిరోజు సందర్భంగా బంధుమిత్రులకు మొక్కలు గిఫ్ట్‌గా ఇస్తున్నారు. మొక్కను కానుకగా అందుకున్న వారు ఇంటికి వెళ్లిన తర్వాత నాటి సంరక్షిస్తున్నారు. మొక్కను చూసినప్పుడల్లా అది ఇచ్చిన వారిని గుర్తు చేసుకుంటున్నారు. కొందరైతే విలువైన మొక్కలను కానుకగా ఇస్తున్నారు. అలాగే చాలామంది పుట్టిన రోజున, పెళ్లిరోజు మొక్కలు నాటడం అలవాటు చేసుకున్నారు. కొందరైతే ఆ రోజున ఎక్కువ సంఖ్య లో మొక్కలు నాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులకు మొక్కలు అందించి స్వాగతం పలుకుతున్నారు. గతంలో బొకేలు ఇవ్వడం, పూలదండలు వేయడం, శాలువాలు కప్పేవారు. ప్రస్తుతం మొక్కలు మాత్రమే ఇస్తున్నారు. ఒకరిని చూసి ఒకరు మొక్కలు ఇస్తుండడంతో మొక్కలు ఇచ్చే కానుకల సంప్రదాయం పెరుగుతోంది. పట్టణాల్లో నే కాదు గ్రామాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లినా మొక్కలు గిఫ్ట్‌గా ఇస్తున్నారు.

అప్పటి కలెక్టర్ ఎందరికో స్ఫూర్తి..

కామారెడ్డి జిల్లా ఏర్పాటై కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్ సత్యనారాయణ జిల్లా కేంద్రానికి ఉన్నతాధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, వీఐపీలు ఎవరు వచ్చినా సరే వారితో మొక్క నాటించే సంప్రదాయాన్ని ప్రారంభించారు. పాత కలెక్టరేట్ ప్రాంగణంలో వందలాది మొక్కలు నాటించారు. అవన్నీ పెరిగి పెద్దయ్యాయి. అప్పుడే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాశివనం ఏర్పాటు చేసి రాశుల వారీగా మొక్కలు నాటించారు. మొక్కనాటే వారు దానికి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పుడు రాశీవనం పెద్ద వనంగా మారింది. ఎస్పీగా పని చేసిన శ్వేత పోలీసు రక్షక వనం ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున మొక్కలు నాటించారు.



ఎండ్రియాల్‌లో తన పుట్టిన రోజు సందర్భంగా మొక్క నాటుతున్న చరణికృతి



తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా మొక్క నాటుతున్న టీఎస్పీఎస్సీ మెంబర్ సుమిత్రానంద్



వనజీవి రామయ్య దంపతులకు మొక్కలు అందజేస్తున్న బీబీపేట వైద్యుడు పెరుమాండ్లు



అదనపు కలెక్టర్ మను చౌదరికి మొక్కను అందజేస్తున్న టీఎన్జీవోస్ ప్రతినిధులు



హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శినికి మొక్కను అందజేస్తున్న న్యాయవాదులు



ఎమ్మెల్సీ కవితకు మొక్కను అందజేస్తున్న సోమారంపేటకు చెందిన యువ కవి నవీన్‌రెడ్డి

మరికొందరు హరిత ప్రేమికులు..

- తమ కూతురి పుట్టిన రోజు వేడుక అందరికీ గుర్తుండేలా అతిథులకు తలా ఒక మొక్క గిఫ్ట్‌గా ఇచ్చారు కామారెడ్డి పట్టణానికి చెందిన దంపతులు సృజన్, వెన్నెల. బర్త్‌డే ఫంక్షన్‌కు వెళ్లిన వారంతా తాము అందుకున్న మొక్కను తీసుకెళ్లి తమ ఇంటి ఆవరణలో నాటారు. మొక్కలు కానుకగా ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు సృజన్, వెన్నెల.
- బీబీపేట మండల కేంద్రానికి చెందిన డాక్టర్ పెరుమాండ్లు ఛత్రపతి శివాజీ ఫౌండేషన్‌ను స్థాపించి అనేక సామాజిక, సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకులను పంపిణీ చేస్తారు. ఆయన ఏ కార్యక్రమం చేపట్టినా అతిథులకు మొక్కను గిఫ్ట్‌గా ఇచ్చి పంపిస్తారు. వనజీవి రామయ్య దంపతులను కూడా పిలిచి మొక్కను అందించారు.
- లింగంపేటకు చెందిన గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్ అధికారులు, ప్రజాప్రతినిధుల దగ్గరికి వెళ్లినపుడల్లా ఓ మొక్కను తీసుకువెళ్లి కానుకగా ఇస్తుంటాడు. బొకెలు, శాలువాల కన్నా మొక్క ఇవ్వడం మంచిదని చెబుతాడు.
- మాచారెడ్డి మండలం సోమారంపేటకు చెందిన యువకవి నవీన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా ఓ మొక్కను తీసుకెళ్తాడు. ఇటీవల ఎమ్మెల్సీ కవితను కలిసిన సందర్భంగా మొక్కను అందించాడు.
- తాడ్వాయి మండలం ఎండ్రియాల్ గ్రామానికి చెందిన చరణికృతి అనే అమ్మాయి తన పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటింది. ప్రతీ పుట్టిన రోజున మొక్క నాటాలని నిర్ణయించుకుంది.
- కామారెడ్డి జిల్లా టీఎన్జీవో నాయకులు వెంకటరెడ్డి, సాయిలు కొత్తగా వచ్చిన అధికారులు, అలాగే కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజాప్రతినిధులను కలిసి మొక్కను కానుకగా ఇస్తుంటారు. జిల్లా ఏర్పడిన నాటి నుంచి వందల్లో మొక్కలు అందించారు.
- కామారెడ్డి న్యాయవాదులు ఏదేని కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లా కేంద్రానికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులకు ఓ మొక్కను కానుకగా అందిస్తుంటారు. అక్కడికి వెళ్లినా ఓ మొక్కను తీసుకెళ్లి అందజేస్తారు. కొన్నేళ్లుగా ఈ ఆనవాయితీని కొనసాగిస్తున్నారు.
- కామారెడ్డిలోని చిన్నమల్లారెడ్డికి చెందిన టీఎస్‌పీఎస్సీ మెంబర్ సుమిత్రానంద్ తన బర్త్‌డే, కూతురు, భర్త పుట్టిన రోజున కచ్చితంగా మొక్కలు నాటుతారు. అలాగే ముఖ్యులను కలిసినప్పుడల్లా మొక్కను కానుకగా అందిస్తుంటారు.

'సాగర్'కు తగ్గిన ఇన్‌ఫ్లో



నిజాంసాగర్ ప్రాజెక్టును చూసేందుకు వచ్చిన పర్యాటకులు

- 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో
- పర్యాటకుల సందడి


నిజాంసాగర్(జుక్కల్) : వర్షాలు తగ్గుముఖం పట్టడంతో నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో క్రమక్రమంగా తగ్గుతోంది. శనివారం సాయంత్రానికి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 10 వేల క్యూసెక్కుల మేర వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. దాంతో నిజాంసాగర్ ప్రాజెక్ట్ రెండు వరద గేట్ల ద్వారా 10వేల క్యూసెక్కుల నీటిని మంజీరలోకి విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు 17.8 టీఎంసీలకు గాను ప్రస్తుతం 1404.68 అడుగులు 17.340 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పొరుగు రాష్ట్రాల నుంచి..

నిజాంసాగర్ ప్రాజెక్ట్ వరద గేట్ల ద్వారా నీటి మంజీర నదిలోకి విడుదల చేస్తుండటంతో శనివారం ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. పొరుగు రాష్ట్రాలతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి పర్యాటకులు ప్రాజెక్ట్ అందాలను తిలకిస్తున్నారు. పర్యాటకులపై పోలీసులు ఆంక్షలు విధించడంతో పలువురు స్పీకర్ పోచారం దృష్టికి తీసుకెళ్లగా పర్యాటకులను అనుమతించాలని ఆదేశించారు.

కేసీఆర్ సుపరిపాలనతో సమృద్ధిగా వర్షాలు

- ప్రకృతి వైపరీత్యాలపై ప్రతిపక్షాలది రాజకీయం
- కాళేశ్వరంతో 1.58 కోట్ల ఎకరాల్లో పంటలు
- పంటనష్టంపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తాం
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



నిజాంసాగర్ ప్రాజెక్టు వరద నీటిని పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం, ఎమ్మెల్యే హన్మంత్ సింధే

నిజాంసాగర్ (జుక్కల్) : సీఎం కేసీఆర్ సుభిక్షమైన పాలనలో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలు, చెరువులు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరాయని వానాకాలం, యాసంగి సాగుకు ఢోకా లేదన్నారు. కాగా వర్షాలతో పంటనష్టంపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. స్పీకర్ శనివారం కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ ప్రాజెక్ట్‌ను జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధేతో కలిసి స్పీకర్ సందర్శించారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను నీటిపారుదలశాఖ అధికారుల ద్వారా తెలుసుకున్నారు. వరద ప్రాంతాల్లో హెలిక్యాప్టర్ ద్వారా ఆహారం, నిత్యవసరాలు సరఫరా చేస్తుంటే ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదన్నారు. రైతు బాంధవుడు సీఎం కేసీఆర్ యజ్ఞ, యగాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల పుణ్యఫలంగానే వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా రాష్ట్రంలో రూ. 1.58 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు చేయగా, 3 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహార ఉత్పత్తులు వస్తున్నాయన్నారు. ప్రాణహిత రివర్స్ పంపింగ్ పథకాన్ని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో తాను స్వయంగా ప్రారంభించామని, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు 5 టీఎంసీల నీళ్లు తెచ్చామని, నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి జూన్ 21న ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసి ఆయకట్టుకు నీళ్లిచ్చామన్నారు. వానాకాలం పంటల కోసం నీళ్లు కావాలని సీఎం కేసీఆర్‌ని అడిగితే కొండపోచమ్మ ద్వారా 5 టీఎంసీల నీళ్లు ఇస్తామని చెప్పారన్నారు. నిజాంసాగర్ ఆయకట్టు కింద 1.5 లక్షలు, మంజీరా నది పరీవాహక ప్రాంతం లిఫ్ట్‌ల కింద 50 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారన్నారు. నాగమడుగు ఎత్తిపోతల పనుల పరిశీలనకు సీఎం కేసీఆర్ వస్తారని, నిజాంసాగర్ ప్రాజెక్టు పర్యాటకంగా అభివృద్ధి సాధిస్తుందని స్పీకర్ పేర్కొన్నారు. రైతుసమితి జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గంగారెడ్డి, సత్యనారాయణ, వాజిద్‌అలీ, నర్సింహారెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

చెరువుల వద్ద పిచ్చిమొక్కలు తొలగించాలి..

బాన్సువాడ : చెరువుల అలుగుల వద్ద ఉన్న మట్టిని, పిచ్చి మొక్కలను తొలగించాలని ఇరిగేషన్ అధికారులకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని కల్కి చెరువు అలుగును స్పీకర్ పరిశీలించారు. కురుస్తున్న వర్షాల కారణంగా అన్ని చెరువులు నిండుగా ఉన్నాయని, ఎగువ ప్రాంతం నుంచే నీటి ప్రవాహం చెరువుల అలుగుల నుంచి సులువుగా వెళ్లేందుకు అలుగులకు అడ్డంగా ఉన్న మట్టిని, పిచ్చి మొక్కలను తొలగించాలని అన్నారు. ఆయన వెంట ఆర్డీవో భుజంగం, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, కృష్ణారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, శ్రీధర్, మోహన్‌నాయక్, శ్రావణ్‌కుమార్ తదితరులున్నారు.

ప్రజా సమస్యలను మేమే పరిష్కరిస్తాం

- బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల్ని పట్టించుకోవట్లేదు
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్ : బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ప్రజల్ని పట్టించుకునే స్థితిలో లేరని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ వార్డుల్లో సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వర్షం కారణంగా ఇళ్లు ఊరిస్తే ఇళ్లపై కప్పేందుకు టార్పాలిన్లు, ప్లాస్టిక్ కవర్లు, భోజనం లేక ఇబ్బందులు పడుతున్న బాధితులకు నిత్యావసరాలు అందజేయాలని కార్యకర్తలకు సూచించారు. సీజనల్ వ్యాధులు వస్తే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాలన్నారు. కామారెడ్డి పట్టణంలో చిన్నపాటి వర్షాలకు మునిగిపోయే స్లబ్ ఏరియాలు ఇప్పుడు ముంపు లేకుండా ఉన్నాయంటే అది కాంగ్రెస్ హయంలో కేంద్రంతో కొట్లాడి శాశ్వతంగా నిర్మించిన డ్రైనేజీలే కారణమన్నారు. ఇప్పుడు మున్సిపల్‌లో కమీషన్లు, కాంట్రాక్టర్‌లు, కబ్జాల పర్వం కొనసాగుతుందన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి సెట్ బ్యాక్ తీసుకోకుండా మురికికాలువలను నిర్మించకుండా పట్టణ అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కామారెడ్డి మున్సిపాలిటీ అవినీతిని నిర్మూలించి పచ్చదనం, పరిశుభ్రతో కూడిన కామారెడ్డిని పునర్నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి, నాయకులు పండ్ల రాజు, ఐరేని సందీప్, గుడుగుల శ్రీనివాస్, కారంగుల అశోక్ రెడ్డి, ఐరేని సందీప్, శ్రీనివాస్ యాదవ్ తదితరులున్నారు.

మక్కబుట్ట భలేగుంది..

నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్ ప్రాజెక్ట్ గుల్‌దస్తా వద్ద శనివారం అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే సరదాగా మక్కబుట్టలు తిన్నారు. మక్కబుట్టల రుచి భలేగా ఉంది అంటూ స్పీకర్ పోచారం తన శిష్యుడు ఎమ్మెల్యే హన్మంత్ సింధేతో అన్నారు.



నిజాంసాగర్ గుల్‌దస్తా వద్ద మక్కబుట్టలు తింటున్న స్పీకర్ పోచారం, ఎమ్మెల్యే సింధే

పులులను రక్షించుకోవాలి

- అటవీ డివిజనల్ అధికారి గోపాల్‌రావు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : పులులను రక్షించుకొని, అడవులను కాపాడుకోవాలని అటవీ శాఖ డివిజనల్ అధికారి గోపాల్‌రావు అన్నారు. తాడ్వాయి మండలంలోని సంతాయిపేట్ శివారులోని అటవీ ప్రాంతంలో శనివారం అంతర్జాతీయ పులుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పులుల ప్రాముఖ్యత, వాటివల్ల జీవన వైవిధ్య, సమతుల్యం ఏవిధంగా ఏర్పడుతుందో ప్రజలకు వివరించారు. ప్రపంచంలో ఉన్న పులుల్లో మనదేశంలోనే 75 శాతం పులులు ఉన్నాయన్నారు. అడవుల్లో పులులు ఉంటే అడవి బాగుంటుందని, మిగితా అడవి జంతువులను సమతుల్యంగా ఉంచడంలో ప్రధాన పాత్ర పోశిస్తుందన్నారు. 2022 గణాంకాల ప్రకారం దేశంలో 3,167 పులులు ఉన్నాయన్నారు. పులుల సంరక్షణ కోసం 1973లో ప్రాజెక్టు టైగర్ మిషన్‌లో దేశంలో ప్రారంభించారన్నారు. అక్రమంగా అడవుల్లో చెట్లను నరకవద్దన్నారు. మొక్కలు నాటడమే కాకుండా ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. అనంతరం వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి రమేశ్, సెక్షన్ ఆఫీసర్లు భీంరెడ్డి అనురంజని, బీట్ ఆఫీసర్లు అనీఫ్, నవీన్, సురేష్, సునీత, గ్రామపెద్దలు శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.



సంతాయిపేట్ శివారులో మొక్కలను నాటుతున్న అటవీశాఖ అధికారులు

క్లుప్తంగా

లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువ ద్వారా శనివారం ముప్కాల్ జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ నీటి విడుదలను ప్రారంభించారు. కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాలువలో అడ్డుకట్టలను తొలగించాలని ఆమె కోరారు. వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, ముప్కాల్ సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీలు నాయకుడు పద్మ, సత్యనారాయణ, డీఈఈ సురేశ్ పాల్గొన్నారు.

ఒక గేటు ద్వారా అలీసాగర్ నీటి విడుదల

ఎడపల్లి: అలీసాగర్ రిజర్వాయర్‌లోకి ప్రధాన కెనాల్ నుంచి 600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఒక గేటు ద్వారా అంతే మొత్తంలో దిగువకు విడుదల చేస్తున్నారు.

98 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతిపాదనలు

నిజామాబాద్ సిటీ: జిల్లాలో 98 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపినట్లు ఐసీడీసీ పీడీ రసూల్ బీ తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 1500 అంగన్‌వాడి కేంద్రాలు ఉండగా, ఇందులో 1365 ప్రధాన కేంద్రాలు, 135 మినీ కేంద్రాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 500 జనాభా కలిగిన ప్రతి గ్రామంలో మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రంగా మార్చేందుకు ప్రతిపాదనలు కోరగా, జిల్లాలో 98 కేంద్రాలను మార్చాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు.

రేషన్ బియ్యం పంపిణీకి నేటి వరకు గడువు

సుభాష్‌నగర్: జిల్లాలో ప్రజాపంపిణీ బియ్యం పంపిణీ పూర్తిస్థాయిలో జరగకపోవడంతో డీలర్లు, కార్డుదారుల విజ్ఞప్తి మేరకు ఆదివారం వరకు గడువు పొడిగించినట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి చంద్రప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలకు సంబంధించి బియ్యం కోటా రేషన్ దుకాణాలకు ఆలస్యంగా చేరడం, వర్షాలు ఎడతెరపి లేకుండా కురవడంతో గడువును 29వ తేదీవరకూ పొడగించిన విషయం తెలిసిందే. తాజాగా బియ్యం పంపిణీకి మరో రోజు గడువు పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం వరకూ వందశాతం పంపిణీ పూర్తి చేయాలని డీలర్లకు సూచించారు.

ప్రమాదకరంగా వంతెనలు

- కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రోడ్డుపై..
- కొన్ని శిథిలావస్థలో, మరికొన్ని ఇరుకుగా మారిన వైనం
- ప్రయాణికులకు ఇబ్బందులు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల పరిధిలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై పాత వంతెనలు ప్రమాదకరంగా మారాయి. మండలంలో సుమారు పది వరకు వంతెనలు ఉండగా వాటిలో కొన్ని శిథిలావస్థకు చేరుకోగా, మరికొన్ని ఇరుకుగా మారాయి. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షాలతో మరింత అధ్వానం..

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వంతెనలు ప్రమాదకరంగా మారాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే వంతెనల మనుగడ ప్రశ్నార్థకంగా మారి ముప్పు పొంచి ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. నాగారం వద్ద గత పది సంవత్సరాల క్రితం నిర్మించిన వంతెన వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది. ఈ సీజన్‌లో



నాగారం వద్ద వరద నీటికి కోతకు గురైన వంతెన

మళ్లీ భారీ వర్షాలు పడితే వంతెనల పరిస్థితి అధ్వానంగా మారుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. లింగంపల్లి(ఖుర్దు) వద్ద పాముల వాగు వంతెనపై రోడ్డు కుంగిపోయి బీటలు వారింది. అలాగే లింగంపేట సమీపంలోని పెద్ద వాగు వంతెన ఇరుకుగా ఉండడంతో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వంతెన నిర్మించి దశాబ్దాలు గడుస్తుండడంతో శిథిలావస్థకు చేరుకుంది. గత కొద్ది సంవత్సరాల క్రితం వంతెనకు ఇరువైపులా సపోర్టు కోసం ప్రహరీ గోడలు నిర్మించారు. వంతెనల వద్ద అధికారులు కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు



బీటలు ఏర్పడిన పాముల వాగు వంతెన

పడుతున్నారు. వంతెనలు ఇరుకుగా ఉండడంతో తరుచూ వంతెన పక్కగోడలకు వాహనాలు తాకి ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పొల్కంపేట, భవానిపేట, మెంగారం, ముంబోజిపేట గ్రామాలకు వెళ్లే రోడ్లలో నిర్మించిన వంతెనలకు ఇరువైపులా గోడలు నిర్మించకపోవడంతో రాత్రివేళ తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న పాత వంతెన స్థానంలో కొత్త వంతెనలు నిర్మించాలని, ఇరుకు వంతెలను విస్తరించి, ఇరువైపులా గోడలు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఇరుకుగా మారిన లింగంపేట పెద్దవాగు వంతెన



గోడలు లేని పొల్కంపేట శివారులోని వంతెన

వేద గణితం పూర్వవైభవానికి జిల్లావాసి కృషి

కామారెడ్డి రూరల్: మన పూర్వీకులు అందించిన వేదగణితానికి పూర్వ వైభవం తీసుకురావడానికి మండలంలోని చిన్నమల్లారెడ్డి జెడ్పీహెచ్‌ఎస్ గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు విజయగిరి రామకృష్ణ కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా వేదిక్ మ్యాథ్స్‌పై పాఠశాల స్థాయి నుంచి శిక్షణ ఇస్తూ విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు. అలాగే వివిధ సమావేశాలు, సదస్సుల్లో వేదిక్ మాథ్స్ మీద తరగతులు నిర్వహిస్తున్నారు. పోటీ పరీక్షలకు అవసరం అయిన ఆర్థమెటిక్, రీజనింగ్‌లో కూడా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ, వేద గణితం ప్రాముఖ్యతను వివరిస్తున్నాడు.

పలువురి అభినందన..

హైదరాబాద్‌లో గతవారం మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ ఇండియా, న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ విద్యావిధానం సదస్సులో 'మన కలలు ప్రాచీన వేద గణితం'పై తరగతులు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన 65మంది



వేద గణితంపై ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహిస్తున్న రామకృష్ణ

నిష్ణాతులైన ఉపాధ్యాయులకు వేదగణితంలో మెలకువలు, సులభంగా వాడే విధానం, విద్యార్థులకు వీటి అవసరం గురించి స్పష్టంగా తెలిపి వారి మన్ననలు పొందారు. దీన్ని తిరిగి పాఠశాల స్థాయి నుంచి ప్రాచుర్యంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. దీంతో ఈయనకు పలువురు రాష్ట్రస్థాయి అధికారులు అభినందించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలి

నిజాంసాగర్(జుక్కల్): ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే ప్రజాప్రతినిధులకు సూచించారు. నిజాంసాగర్ గుల్‌దస్తా వద్ద శనివారం ఆయన సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీల చైర్మన్లు, నాయకులతో సమావేశం అయ్యారు. గత ఎన్నికల్లో గ్రామాల వారీగా ఇచ్చిన హామీలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. గృహలక్ష్మి పథకం కింద 5వేల ఇళ్ల మంజూరు కోసం సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లానని తెలిపారు. సీడీసీ చైర్మన్ గంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారా



ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధే

యణ, సొసైటీల చైర్మన్లు వాజిద్‌అలీ, నర్సింహారెడ్డి, సర్పంచులు లక్ష్మీనారాయణ, సంగమేశ్వర్ గౌడ్, చెందర్‌రాథోడ్, కమ్మరికత్త నారాయణ, నాయకులు నారాయణ, రాంచెందర్, శ్రీధర్‌రెడ్డి, అబ్జల్, గోర్గంటి రాములు, బాబుసేట్ తదితరులు ఉన్నారు.

ఆపన్న హస్తం అందించరూ!

- కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు
- వైద్యానికి రూ.ఐదు లక్షలు అవసరం
- దాతల సాయం కోరుతున్న తల్లిదండ్రులు

మాచారెడ్డి: పుట్టిన కొడుకును చూసి మురిసిపోతున్న ఆ పేద తల్లిదండ్రులకు పెద్ద కష్టం వచ్చింది. కుక్కల దాడిలో బాబు గాయపడటంతో వైద్య ఖర్చుల కోసం దాతల సాయం కోరుతున్నారు. మాచారెడ్డి మండలం అంకిరెడ్డిపల్లి తండాకు చెందిన బానోత్ జ్యోతి, సురేశ్ దంపతులకు నెల క్రితం కుమారుడు జన్మించాడు. రెండు రోజుల కిందట ఇంట్లో నిద్రిస్తున్న బాబుపై కుక్కలు దాడి చేశాయి. ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఇప్పటికే రూ.నాలుగు లక్షలు ఖర్చయ్యాయి. మరో రూ.ఐదు లక్షల వరకు అవసరం అవుతాయని వైద్యులు తెలిపారు. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ



చికిత్స పొందుతున్న చిన్నారి

తల్లిదండ్రులు సాయం కోసం వేడుకుంటున్నారు. దాతలు 7013129003, 6301089588 నంబర్లకు ఫోన్ పే ద్వారా సాయం అందిచాలని కోరారు.

సుర్భిర్యాల్‌ను సందర్శించిన కేంద్ర బృందం



పెర్కిట్: ఆర్మూర్ మండలం సుర్భిర్యాల్ గ్రామాన్ని స్వచ్ సర్వేక్షణ్ గ్రామీణ్ కేంద్ర బృందం సభ్యులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, కాంపోస్టు షెడ్డులో తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ, ఇంకుడు గుంతలు, కమ్యునిటీ సోక్ పిట్‌లను పరిశీలించారు. స్వచ్ఛ భారత్ కింద చేపట్టిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బృందం సభ్యులు గణేశ్, డీపీఎం మారుతి, సర్పంచ్ సట్లపల్లి సవిత గణేశ్, ఐకేపీ ఏపీఎం గంగారం, ఈజీఎస్ ఏపీవో సురేష్, జీపీ కార్యదర్శులు రవి కుమార్, దేవేందర్, మురళికాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్‌లకు లైన్ క్లియర్

మోర్తాడ్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న గెస్ట్ అధ్యాపకులను రెన్యూవల్ చేసిన మాదిరిగానే డిగ్రీ కళాశాలల్లోని గెస్ట్ ఫ్యాకల్టీని కొనసాగించాలని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ డిగ్రీ కళాశాలల్లోని గెస్ట్ అధ్యాపకులను రెన్యూవల్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. విద్యాశాఖ నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలోని 100 మంది గెస్ట్ అధ్యాపకులకు ఊరట లభించింది. గెస్ట్ అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకుల మాదిరిగా రెన్యూవల్ చేయకుండా ప్రతి విద్యాసంవత్సరంలో ఇంటర్వ్యూలను నిర్వహించి కొత్తగానే విధుల్లోకి తీసుకునేవారు. ఈ విధానంతో అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత లభించక వారిలో ఆందోళన నెలకొంది. పేరుకే అతిథి అధ్యాపకులమైనా రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకుల మాదిరిగానే తాము కూడా కళాశాలల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని వారు హైకోర్టుకు విన్నవించారు. ప్రతి సంవత్సరంలో మౌఖిక ఇంటర్వ్యూలను నిర్వహించే విధానానికి స్వస్తి పలకాలని హైకోర్టు తలుపు తట్టడంతో న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారు. మొదట జూనియర్ కళాశాలల అధ్యాపకులు హైకోర్టును ఆశ్రయించి రెన్యూవల్ ఉత్తర్వులను అందుకున్నారు. వారి మార్గంలోనే డిగ్రీ కళాశాలల అధ్యాపకులు కూడా ఇటీవల హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో, అందుకు అనుగుణంగా ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ రెన్యూవల్ ఉత్తర్వులను జారీ చేశారు. ఇటీవల గెస్ట్ అధ్యాపకుల పోస్టుల భర్తీకి ఆయా డిగ్రీ కళాశాలలు నోటిఫికేషన్ జారీ చేశాయి. ఇంటర్వ్యూలను నిర్వహించాల్సి ఉండగా భారీ వర్షాలతో వాయిదా పడింది. చివరకు గతంలో గెస్ట్ అధ్యాపకులుగా పని చేసిన వారినే కొనసాగించాలని ఉత్తర్వులు వెలువడంతో వారికి ఊరట కలిగినట్లు అయింది.

'మంత్రి కమీషన్ల కక్కుర్తికి రైతులు బలి'



సుంకెట్‌లో బాధిత రైతులతో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

మోర్తాడ్: మంత్రి ప్రశాంత్‌రెడ్డి కమీషన్ల కక్కుర్తికి మోర్తాడ్ మండలంలోని సుంకెట్‌కు చెందిన రైతులు బలి పశువులుగా మారారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆరోపించారు. పటిష్టంగా ఉండాల్సిన చెక్‌డ్యాంలు ఒకటి రెండు రోజుల వర్షానికి కోతకు గురి కావడం చూస్తుంటే ఇంజినీర్ల వైఫల్యం ఎంతో ఉందన్నారు. దీనికి మంత్రి, ఇంజినీర్లు బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం సుంకెట్‌లో చెక్‌డ్యాంకు కోత ఏర్పడి నీట మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. రెండు వాగులు కలిసే చోట చెక్‌డ్యాం నిర్మించడం తప్పని, అందులోను నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో వందలాది ఎకరాల్లో నీరు ప్రవహించి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. గతంలోను ఒకసారి చెక్‌డ్యాం కోతకు గురికాగా మరోసారి కోత ఏర్పడి మంత్రి, ఇంజినీర్ల వైఫల్యాలను నిరూపించిందన్నారు. బాధిత రైతులకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్యాల రాములు, బద్దం రాజశేఖర్, వేణురాజ్, సుధీర్, అశోక్, దేవేందర్, గంగారెడ్డి, బూత్‌పురం మహిపాల్, రవి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెట్లు నరికిన వారిపై కేసు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి అటవీశాఖ రేంజ్ పరిధిలోని తిమ్మాపూర్ తండా అటవీ ప్రాంతంలో చెట్లను నరికిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రేంజ్ అధికారి ఓంకార్ శనివారం తెలిపారు. తిమ్మాపూర్ తండాకు చెందిన కాట్రోత్ లాక్యాతో పాటు మరి కొందరు అటవీ ప్రాంతంలో చెట్లను నరుకుతున్నారన్న సమాచారం మేరకు వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. చెట్ల నరికి ఉండడంతో లాక్యాతో పాటు మరి కొందరిపై అటవీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయడంతో పాటు వీరిపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామన్నారు.

దాడి చేసిన ఆటోడ్రైవర్లపై ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని పెద్ద బజార్‌లో నడుచుకుంటూ వెళ్తున్న యాదగిరి అనే వ్యక్తిపై ఓ ఆటో డ్రైవర్ దాడి చేశాడు. దీంతో యాదగిరి వెంటపడి నెహ్రూ పార్క్ వద్ద పట్టుకొని ప్రశ్నించగా అక్కడే ఉన్న మరో డ్రైవర్ దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు ఫిర్యాదు చేసినట్లు రెండో టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు.

ఆటో చోరీ కేసులో ఒకరి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

బాన్సువాడ: బాన్సువాడ గురుకృప సూపర్ మార్కెట్ ముందు నుంచి ఆటోను ఎత్తుకెళ్లిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏప్రిల్ 18న గురుకృప సూపర్ మార్కెట్ ఎదుట అమృతం కాశీరాం తన ప్యాసింజర్ ఆటోను నిలిపి ఉంచాడు. తర్వాత వచ్చి చూసే సరికి ఆటో కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం కొయ్యగుట్ట వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో వర్ని మండలం సేవలాల్ తండాకు చెందిన మెగావత్ దుర్గా ప్రసాద్ అనే వ్యక్తి దొంగిలించిన ఆటోను తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు చెప్పారు.

వరకట్నం కేసు నమోదు

మోపాల్: మండలంలోని మంచిప్పలో శుక్రవారం సాయంత్రం మౌనిక ఆత్మహత్య చేసుకున్న కేసులో మృతురాలి తల్లి బాగున్నా ఫిర్యాదు మేరకు భర్త సాయికుమార్, అత్త నవనీతపై వరకట్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము శనివారం తెలిపారు. సాయికుమార్, మౌనికకు రెండేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లయిన నాటి నుంచే అదనపు కట్నం కోసం సాయికుమార్ వేధించేవాడు. గతంలో పలుమార్లు పంచాయితీ పెట్టారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఇరువురిపై వరకట్నం కేసు నమోదు చేశారు. మృతురాలి బంధువుల ఆందోళన నేపథ్యంలో ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ వెంకట నారాయణ, ఎస్సై రాము పరిస్థితి అదుపు చేశారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి



ఆర్మూర్‌టౌన్: పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఏసీపీ జగదీశ్‌చందర్ సూచించారు. ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌ను నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ శనివారం సందర్శించారు. గంజాయి రవాణా, పేకాట, చోరీలను అరికట్టాలన్నారు. పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తెలతాడు కోసం దంపతుల హత్య

- కేసు ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్టు

బాన్సువాడ: జల్సాలకు అలావాటు పడిన ఇద్దరు యువకులు పుస్తెల తాడు కోసం వృద్ధ దంపతులను హతమార్చారు. బీర్కూర్ మండలం రైతునగర్‌లో దంపతుల హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో శనివారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 25న రైతు నగర్‌లో కిరాణ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్న దారం నారాయణ (75), దారం సులోచన (70) దంపతులు హత్యకు గురయ్యారు. మృతుడి సోదరుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని ఎస్పీ తెలిపారు. శనివారం దామరంచ గ్రామానికి చెందిన బంగ్లా చింటూ అలియాస్ చరణ్, అతని తండ్రి బంగ్లా లక్ష్మణ్ బీర్కూర్‌లోని బంగారు దుకాణంలో పుస్తెల తాడును విక్రయించే ప్రయత్నం చేయగా



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

పట్టుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా చింటూ తన స్నేహితుడైన ఎర్రోళ్ల నవీన్‌తో కలిసి నారాయణ, సులోచనలను హత్య చేసినట్లు అంగీకరించాడని ఎస్పీ చెప్పారు. పేకాటతో పాటు ఇతర వ్యసనాలకు అలవాటు పడ్డా చింటూ, నవీన్ అప్పుడప్పుడు నారాయణ దుకాణానికి వెళ్లేవారని, సులోచన మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును దొంగిలించాలని పథకం వేశారన్నారు. అందులో భాగంగా ఘటన జరిగిన రోజు నిందితులు నారాయణ ఇంటి వెనుకాల నుంచి గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించారన్నారు. ముందుగా సులోచనను హత్య చేశారని, అనంతరం ముందు గదిలో టీవీ చూస్తున్న నారాయణ వద్దకు వెళ్లి ఆయనను కూడా చంపేశారన్నారు. సులోచన మెడలో ఉన్న మూడు తులాల బంగారం పుస్తెల తాడును ఎత్తుకెళ్లారని చెప్పారు. పుస్తెల తాడును మూడు ముక్కలు చేసి చింటూ, లక్ష్మణ్, నవీన్ పంచుకున్నారన్నారు. పుస్తెల తాడును స్వాధీనం చేసుకొని చింటూ, నవీన్‌తో పాటు లక్ష్మణ్‌ను అరెస్ట్ చేశామని ఎస్పీ తెలిపారు. నవీన్, లక్ష్మణ్‌పై గతంలో పలు కేసులు ఉన్నాయన్నారు. కేసును ఛేదించిన డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, బాన్సువాడ రూరల్ సీఐ మురళి, పిట్లం, నస్రూల్లాబాద్ ఎస్సైలు విజయ్, రంజీత్‌రెడ్డి, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, ఏఎస్సై రాములు, సీసీఎస్ ఏఎస్సై రాజేశ్వర్, హెచ్‌సీ సురేందర్, కానిస్టేబుళ్లు, సుభాష్, వస్సీ, సంగమేశ్వర్‌ను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

బోధన్‌లో చోరీ

బోధన్‌టౌన్: బోధన్‌లోని గౌడ్స్ కాలనీలోని ఓ ఇంట్లో శనివారం పట్ట పగలే చోరీ జరిగింది. తాళం పగుల గొట్టి ఇంట్లోకి చొరబడ్డ దొంగలు 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు. పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌడ్స్ కాలనీలో నివాసం ఉంటున్న హన్మంత్‌రావు పటేల్ పట్టణంలోని ఓ వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం ఆయన భార్య హైదరాబాద్ బంధువుల ఇంట్టికి వెళ్లగా శనివారం ఉదయం హన్మంత్‌రావు ఇంటికి తాళం వేసి పనికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి తాళం పగుల గొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేలు చోరీ అయినట్లు గుర్తించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై పీటర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై పీటర్

ఫిట్స్ వచ్చి దాబాపై నుంచి పడి ఒకరి మృతి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి బీసీ కాలనీలో ఫిట్స్‌తో దాబాపై నుంచి పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై గణేశ్ శనివారం తెలిపారు. వివరాలు.. పట్టణంలోని బీసీ కాలనీలో నివాసముండే ధర్మేందర్ (34) బట్టలను తీసుకుని వచ్చేందుకు ఇంటి దాబాపైకి వెళ్లి తిరిగి రాలేదు. అతడి భార్య లక్ష్మి ఇంటి పైకి వెళ్లి చూడగా ఇంటి వెనకాల గల మురికి కాలువలో ధర్మేందర్ పడి ఉన్నాడు. కిందకు వెళ్లి చూడగా ఆయనలో కదలికలు లేకపోవడంతో వైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వైద్య సిబ్బంది వచ్చి ధర్మేందర్ ఫిట్స్‌తో మృతి చెందినట్లు చెప్పారని ఎస్సై తెలిపారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

నందిపేట్: నందిపేట మండలం ఖుద్వాన్‌పూర్ చెరువు అలుగు వద్ద మూడు రోజుల క్రితం గల్లంతైన యువకుడి మృతదేహం శనివారం లభ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కౌల్పూర్ గ్రామానికి చెందిన పోచమ్మల ఎల్లప్ప(35) అదే గ్రామానికి చెందిన ఐదుగురితో కలిసి గురువారం ఉదయాన్నే షాపూర్ శివారులో గల ఖుద్వాన్‌పూర్ చెరువు అలుగు దగ్గర చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఎల్లప్పతోపాటు మరో వ్యక్తి దుర్గయ్య అలుగులోకి దిగగా ప్రవాహం ఉధృతంగా ఉండడంతో బయటకు వచ్చే ప్రయత్నంలో ఇద్దరు కొట్టుకుపోయారు. దుర్గయ్య కొద్ది దూరం కొట్టుకుపోయి ప్రాణాలతో బయట పడగా ఎల్లప్ప గల్లంతయ్యాడు. దీంతో తహసీల్దార్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. కాగా శనివారం నీటిలో మృతదేహం తేలింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాజేందర్ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం గ్రామంలో శనివారం గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందినట్లు ఏఎస్సై వెంకన్న తెలిపారు. మల్లారంలో గత మూడురోజులుగా భిక్షాటన చేస్తూ శనివారం ఉదయం ఓ చెట్టుకింద పడుకుని అక్కడే మృతిచెందాడు. అటుగా వెళ్లేవారు గమనించి సర్పంచ్ నగేష్‌కు తెలిపారు. సర్పంచ్ విషయాన్ని రూరల్ పోలీసులకు తెలుపటంతో ఏఎస్సై వెంకన్న అక్కడకు చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు.

ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మిపై కేసు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ శనివారం తెలిపారు. వివరాలు.. జూన్ 23న ఆకుల కొండూర్ గ్రామం చెరువులో నుంచి సర్పంచ్ అశోక్, గ్రామస్తులు కొందరు మట్టి తీస్తున్నారనే సమాచారంతో ఏఈ అక్కడకు వెళ్లి ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దీనిపై గ్రామ సర్పంచ్ తమ గ్రామ తీర్మానం మేరకు చెరువులో నుంచి గ్రామంలో నిర్మిస్తున్న మహాలక్ష్మీ ఆలయానికి, పంట పొలాలకు మట్టిను తీసుకెళ్తున్నటు చెప్పారు. ఈ ఘటనలో ఏఈ, సర్పంచ్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా ఏఈ సర్పంచ్, కొందరు గ్రామస్తులపై రూరల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. అనంతరం ఏఈకు బాసటగా ప్రభుత్వ ఉద్యోగులు కలెక్టర్‌ను కలిసి విషయాన్ని తెలిపారు. కలెక్టర్ జోక్యంతో సర్పంచ్‌పై, కొందరు గ్రామస్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదే రోజు సర్పంచ్ ఏఈపై ఫిర్యాదు చేయగా పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. ప్రభుత్వ ఉద్యోగి కావడంతో కేసు నమోదు చేయకుండా కోర్టు అనుమతి కోసం పంపారు. కోర్టు నుంచి అనుమతి రాగానే ఏఈపై ఐపీసీ సెక్షన్లు 304, 306 కింద కేసు నమోదు చేశారు.

పేకాట స్థావరంపై దాడి

రాజంపేట: రాజంపేటలోని ఓ ఇంట్లో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. వారి నుంచి రూ.49,400 నగదు, నాలుగు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.